
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 45.1 । కనిష్ఠం : 25.4

ANDHRAJYOTHY

5



వనపర్తి

జిల్లా వార్తలు

మంగళవారం 30 ఏప్రిల్ 2024

బైక్‌లు ఢీకొని మహిళ మృతి

చిన్నంబావి, ఏప్రిల్ 29 : మండల కేంద్రంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. ఎస్సై పబ్బతి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నదగడ గ్రామానికి చెందిన రాఘవాచారి తన భార్య మాధవి(38), ఆరేళ్ల పాపతో కలిసి బుక్కాపురంలో బంధువుల గృహప్రవేశానికి వెళ్లి తిరిగి ఆదివారం రాత్రి బైక్‌పై గ్రామానికి వస్తున్నారు. ఎదురుగా మరో బైక్‌పై చిన్నమారూరుకు చెందిన శరణ్ చిన్నంబావి నుంచి గ్రామానికి వెళ్తుండగా కేడీఆర్ పాఠశాల సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో గాయపడిన మాధవిని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల

బరిలో 50 మంది



నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న స్వతంత్ర అభ్యర్థి శ్రీకాంత్ పిల్లల

- పాలమూరు నియోజకవర్గం నుంచి 31 మంది
- నాగర్‌కర్నూల్‌లో నుంచి 19 మంది పోటీ
- రెండు నియోజకవర్గాల్లో ఆరుగురు నామినేషన్ల ఉపసంహరణ
- అభ్యర్థుల లెక్క తేలడంతో ఉపందుకోనున్న ప్రచారం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో మరో అంకం నామినేషన్ల ఉపసంహరణ సోమవారం ముగిసింది. దాంతో పాలమూరు నియోజకవర్గం నుంచి 31 మంది, నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి 19 మంది బరిలో నిలిచారు. రెండు నియోజకవర్గాల్లో ఆరుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. 25వ తేదీతో గడువు ముగిసింది. ఆ తర్వాత రోజు అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. మహబూబ్‌నగర్ పరిధిలో 42 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, అందులో ఏడుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు సోమవారం రోజు స్వతంత్ర అభ్యర్థులు మహ్మద్ ఇంతియాజ్, మహ్మద్ అబ్దుల్ రహీం, శ్రీకాంత్ పిల్లెల, కె.జంగయ్య తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 42 మందిలో పరిశీలనలో ఏడుగురు, ఉపసంహరణలో నలుగురు అభ్యర్థులు వైదొలగడంతో.. ఎన్నికల బరిలో 31 మంది నిలిచారు. కాంగ్రెస్ తరఫున సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి బరిలో నిలవగా.. బీజేపీ నుంచి ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బరిలో నిలిచారు. వచ్చే నెల 13న పోలింగ్ జరగనుంది. ఇప్పటికే అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉండగా, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి వెనుకపడ్డారు. ఈ నెల 11 వరకు ప్రచారం చేసుకునేందుకు అవకాశం ఉండటంతో ఈ 13 రోజుల్లో ప్రచారాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లాలని అభ్యర్థులు యోచిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పాలమూరులో నిర్వహించిన మూడు బహిరంగ సభల్లో, పార్లమెంట్ పరిధిలోని నాలుగు సమావేశాల్లో పాల్గొన్నారు. ఇంకా కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారానికి కొంత మంది అగ్ర నాయకులు వచ్చే అవకాశం ఉంది. బీజేపీ తరఫున ఇప్పటివరకు ఎవరూ రాకపోయినప్పటికీ.. ఇప్పుడు అభ్యర్థులు లెక్క తేలడంతో నరేంద్రమోదీ సభ పాలమూరులో ఉంటుందని సమాచారం. ఆయనతో పాటు మరికొంత మంది బీజేపీ అగ్ర నాయకులు హాజరయ్యే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి తరఫున ఇప్పటికే ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. రానున్న రోజుల్లో ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్లు హరీశ్‌రావు, కేటీఆర్ సమావేశాలు, ప్రచారానికి హాజరయ్యే అవకాశం ఉంది.

నాగర్‌కర్నూల్‌లో ఇద్దరు ఉపసంహరణ

నాగర్‌కర్నూల్(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 21 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా, సోమవారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. దాంతో ఈ నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది బరిలో నిలిచారని పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

అంబట్‌పల్లిలో.. దారుణం

- కోడలిని చంపిన అత్త, ఆడపడుచు


లింగాల, ఏప్రిల్ 29 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లి గ్రామంలో దారుణం జరిగింది. కోడలిని అత్త, ఆడపడుచు కలిసి గొంతు నులిమి హత్య చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో వడ్డియా విజయ(32) మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతురాలి భర్త వడ్డ్యి చంద్రు మద్యం తాగి నిద్రలో ఉన్న సమయంలో అత్త, ఆడపడుచు కలిసి పథకం ప్రకారం విజయ గొంతు నులమడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. హత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలిసింది. మృతురాలికి భర్తతో పాటు, నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న అచ్చంపేట సీఐ రవీందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ ప్రారంభించారు.

TOLL FREE 14416..

- మానసిక సమస్యలకు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌తో పరిష్కారం
- ఫోన్‌లోనే కౌన్సెలింగ్, వైద్య సేవలు
- టెలీ మానస్ పేరుతో వినూత్న కార్యక్రమం
- జిల్లాలో మూతపడ్డ డీఎంహెచ్‌పీ క్లినిక్



టోల్‌ఫ్రీ నంబర్‌పై రూపొందించిన వాల్ పోస్టర్



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఏప్రిల్ 29: ప్రస్తుత సమాజంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ పలు రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తమ సమస్యకు చావే పరిష్కారం అని అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి, వైద్య సేవలు అందించడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం టెలీమానస్ పేరుతో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం గత ఏడాది ప్రారంభం కాగా, పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదు. మానసిక సమస్యలపై గత ఏడాది డీఎంహెచ్‌పీ(డిస్ట్రిక్ మెంటల్ హెల్త్ క్లినిక్) కూడా ఏర్పాటు చేసినా డాక్టర్ లేకపోవడంతో మధ్యలోనే ఆగిపోయింది. ఇటీవల ఈ టోల్‌ఫ్రీ నంబర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది.

ప్రస్తుతం మనిషిని మానసిక సమస్యలు చుట్టుముట్టి, ప్రాణాలు సైతం తీసుకునేలా చేస్తున్నాయి. అందులో మానసిక, శారీరక, ఆర్థికపరమైన ఒత్తిళ్లు ఉంటున్నాయి. ముఖ్యంగా జ్ఞాపకశక్తి సమస్యలు, పరీక్షల

మానసిక సమస్యలకు కారణాలివీ..



భయం, ఓటమి భయం, ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు, వ్యసనాలకు బానిసకావడం, ఒంటరి తనం వంటి సమస్యలు ఉంటున్నాయి. వాటినే పెద్ద సమస్యగా భావిస్తూ, కొందరు ఆత్మహత్యాయత్నం చేస్తుండగా, మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవలి కాలంలో పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని, ర్యాంకులు రావడం లేదని కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

హైదరాబాద్‌లో కంట్రోల్ రూమ్

మనిషిలో ఎలాంటి మానసిక సమస్యలు ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేస్తే వెంటనే వారు స్పందించి, మీ సమస్యకు పరిష్కారం చూపిస్తారు. అంతేకాకుండా మనసు మార్చేందుకు కౌన్సెలింగ్ ఇస్తారు. వైద్యసేవలు కూడా ఫోన్‌లోనే అందిస్తారు. ఇందుకు సంబంధించిన వ్యవస్థ అంతా హైదరాబాద్‌లోని కంట్రోల్‌రూంలో ఉంటుంది. 24 గంటలు అందుబాటులో ఉంటారు. ఎవరైనా ఎప్పుడైనా ఫోన్‌చేసి, మీ సమస్యను చెప్పొచ్చు.

కాలింగ్‌లో 8వ స్థానం

మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల నుంచి ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తున్నారు. ప్రతీ జిల్లాకు రోజుకు 200 కాల్స్ వరకు టార్గెట్ ఇవ్వగా, మహబూబ్‌నగర్ జిల్లాలో ఆ టార్గెట్‌ను చేరుకోవడం విశేషం. పీహెచ్‌సీలలోని స్టాఫ్ నర్సులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహబూబ్‌నగర్‌కు ఎనిమిదో స్థానం దక్కింది. జిల్లా నుంచి రోజూ 150 నుంచి 180 వరకు కాల్స్ వెళ్తున్నాయి. ప్రస్తుతం పరీక్షల ఫలితాల కాలం కావడంతో చాలా మంది ఈ టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారుల కోరుతున్నారు.

జనరల్ ఆస్పత్రికి రెఫర్

టెలీమానస్‌లో భాగంగా గత ఏడాది జడ్చర్లలోని జిల్లా ఆస్పత్రిలో డీఎంహెచ్‌పీ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్సు ఒక స్టోర్ అసిస్టెంట్‌లను నియమించారు. ఆ డాక్టర్ ప్రతీ పీహెచ్‌సీకి వెళ్లి మానసిక సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్యసేవలు అందించేవారు. కానీ ఆ డాక్టర్‌కు పదోన్నతి వచ్చి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లడంతో ఆ క్లినిక్ మూతపడింది. ఆ పోస్ట్ కూడా రద్దయ్యింది. అయితే జనరల్ ఆస్పత్రిలో మానసిక విభాగం ఉండటంతో పీహెచ్‌సీలకు వచ్చే వారిని అక్కడికి పంపిస్తున్నారు.

కష్టపడి పని చేయండి

- పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రియాంకగాంధీ, రేవంత్ సభలు
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ



దీపాదాస్‌మున్షీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29: బూత్ లెవెల్ నుంచి అందరూ కష్టపడి పని చేయాలని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆమె పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీల వారీగా పార్టీ చేపడుతున్న ప్రచార కార్యక్రమాలు, కేడర్ పని తీరు, ఇంకా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు దేశంలో విడుదల చేసిన మెనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్లమెంట్ పరిధిలో ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలు ఉంటాయని చెప్పారు. ఎమ్మెల్యేలంతా సమష్టిగా పని చేసి, ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి, ఈర్లపల్లి శంకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, వినోద్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, సంజీవ్‌ముదిరాజ్, ఎన్‌పీ వెంకటేశ్ పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తాం: వంశీచంద్‌రెడ్డి

కోయిలకొండ: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వింజమూరు, కోయిలకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి కావడం గొప్ప వరమన్నారు. సీఎం కృషితో పాలమూరు దశ మారబోతుందని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజుల్లోనే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసిందన్నారు. కోయిలకొండ మండలంలోని ప్రతీ చెరువును నింపి, సాగునీటి కలను సాకారం చేస్తామన్నారు. గార్లపాడ్ త్వరలో మండలం కాబోతోందన్నారు. తనను అధిక మెజారిటీతో గెలిపిస్తే అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ నారాయణపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రైతులకు సాగునీటి కల సాకారం కానుందన్నారు. ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నారాయణపేట నాయకులు కే.శివకుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జీ.రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్ గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు రోజా రోజా నాయకులు, జగన్ గౌడ్, యాదవ్ కుమార్, నరేందర్ గౌడ్, రామస్వామి, నాగరాజు, గౌస్, బాల్‌రాజ్ గౌడ్, విక్కీగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అరుణమ్మపై కుట్రలు చేస్తున్నారు

- నాడు జైపాల్‌రెడ్డి.. నేడు రేవంత్‌రెడ్డి : డీకే అరుణ



వెంకటాపూర్ ఆలయంలో పూజలు చేస్తున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్/హన్వాడ, ఏప్రిల్ 29: అరుణమ్మను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. నాడు కాంగ్రెస్‌లో పెద్దమనిషి జైపాల్‌రెడ్డి తనపై కుట్రలు చేస్తే.. నేడు ఆయన అల్లుడు రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం ఆమె మహబూబ్‌నగర్ మండలంలోని మణికొండ, కోడూరు, జమిస్తాపూర్ గ్రామాలలో పర్యటించారు. వెంకటాపూర్‌లోని హనుమాన్ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ రిజర్వేషన్లు తీసేస్తుందని ప్రజలను కాంగ్రెస్ మభ్యపెట్టేందుకు తప్పుడు ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. అరుణమ్మ విజయం ఖాయమని తెలిసి ఓటమి భయంతో కుల రాజకీయాలకు తెర తీశారన్నారు. మోదీ హామీ ఇచ్చారంటే నెరవేర్చి తీరతారని, రేవంత్‌రెడ్డిలా ఓట్ల కోసం, అధికారం కోసం.. హామీలిచ్చి విస్మరించబోరన్నారు. కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థికి ఈ ఊరుకానీ, ఇక్కడి సమస్యలు కానీ తెలియవన్నారు. కల్వకుర్తి నుంచి వచ్చిన వాళ్లు ఇక్కడ రాజకీయాలు చేయొచ్చు కానీ.. ఇక్కడే పుట్టి పెరిగిన తాను ఇక్కడ పోటీ చేయద్దట.. ఇదెక్కడి న్యాయమో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ఆడబిడ్డపై కుట్రలు చేస్తున్న సన్నాసులకు సిగ్గుండాలని మండిపడ్డారు. మోదీ పదేళ్ల పాలనలో శాంతిభద్రతలు బాగున్నాయని, ఉగ్రవాదులు భారతదేశం వైపు కన్నెత్తి చూడకుండా చేశారని అన్నారు. 500 ఏళ్ల క్రితం మహ్మదీయుల పాలనలో రామ మందిరాన్ని ధ్వంసం చేస్తే ఇప్పుడు మోదీ చుక్క నెత్తురు పారకుండా బాలరాముడిని ప్రతిష్ఠించారన్నారు. ఇన్నాళ్లు పాలించిన కాంగ్రెస్ ఈ పని ఎందుకు చేయలేకపోయిందని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డనైన తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి కె.రాములు, అంజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ జూటా మాటలు నమ్మొద్దు

కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టి, జూటా మాటలు చెప్పి మోసం చేసేందుకు కుట్రలు చేస్తుందని, వాటిని నమ్మొద్దని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. సోమవారం ఆమె హన్వాడ మండలం చిన్నదర్పల్లి, నాయినోనిపల్లి, పెద్దదర్పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇబ్రహీంబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పుల్లయ్యతో పాటు పలువురు అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు పద్మజారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా బీజేపీని ఓడిద్దాం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 29: మతోన్మాద బీజేపీని ఓడించడానికి వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సీపీఎం ఆధ్వర్యంలో వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీపీఎం నాయకుల ఆహ్వానం మేరకు ఈ సమావేశానికి మంత్రి జూపల్లితో పాటు మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. దేశంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీకి సీపీఎం మద్దతు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. కార్మికలోకానికి, రైతులకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్న మోదీ ప్రభుత్వం మెడలు వంచి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. దేశ ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య, జాన్‌వెస్లీ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, వనపర్తి మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పీకృష్ణ, సీపీఎం రాష్ట్ర నాయకులు రమణ, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కష్టపడితే విజయం మనదే



కార్యకర్తలతో మల్లు రవి

గోపాల్‌పేట, ఏప్రిల్ 29: ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కష్టపడితే విజయం మనదే అని కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్ నివాసంలో ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భోజన అనంతరం ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడడమే మన కార్యకర్తలు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. కార్యకర్తలు సేవకులుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండ్రాతి గణేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు సుధాకర్ రావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దేవరాజు యాదవ్, ఎస్సీ సెల్ రేవల్లి మండల అధ్యక్షుడు నాగశేషు, హోటల్ శ్రీను, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కథ సుఖాంతం

- మహబూబ్‌నగర్ మండలం బొక్కలోనిపల్లి గ్రామంలో ఘటన
- రంగంలోకి డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్, పోలీసులు
- చీకటిపడ్డాక గ్రామంలో బాలుడి వదిలివేత

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29: ఎండాకాలం కావడంతో ఓ కుటుంబం ఆరు బయట పడుకుంది. తల్లిదండ్రులతో పాటు తమ ఇద్దరు అమ్మాయిలు, బాబు కలిసి పడుకున్నారు. అర్ధరాత్రి తరువాత మెళకువ వచ్చిన తల్లికి మూడేళ్ల బాబు కనిపించకపోవడంతో అందరినీ నిద్రలేపింది. బాబు కోసం చుట్టూ వెతికినా జాడ లభించలేదు. కిడ్నాప్ అయిన 19 గంటల్లో బాలుడు తల్లిదండ్రుల చెంత చేరడంతో కథ సుఖాంతమైంది. పాలమూరు జిల్లాలో సోమవారం కలకలం రేపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ మండలం బొక్కలోనిపల్లి గ్రామానికి చెందిన శేఖర్ మేస్త్రీ పని చేస్తాడు. భార్య మంజుల రైతు కూలీ. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నాడు. చివరి సంతానమైన అబ్బాయి వంశీకి ఇటీవల రెండేళ్లు నిండి, మూడో ఏట అడుగు పెట్టాడు. ఆదివారం రాత్రి భోజనం చేశాక అందరూ కలిసి ఆరుబయట నిద్రించారు. మధ్యరాత్రి తరువాత మంజులకు మెళకువ రాగా పక్కలో బాబు కనిపించలేదు. ఇద్దరు అమ్మాయిలు మాత్రం ఉన్నారు. వెంటనే భర్త, పిల్లలను నిద్రలేపి బాబుకోసం ఆ ప్రాంతమంతా వెతికారు. వీరి ఇల్లు ఊరికి కొద్దిగా దూరంగా, కొండకు దగ్గరగా ఉండటంతో ఆ ప్రాంతమంతా గాలించారు. ఎక్కడా జాడ కనిపించకపోవడంతో రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. తెల్లవారుజామునే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీమ్స్‌తోపాటు పోలీసు జాగిలాలతో వెతికించారు. జాగిలాలు గ్రామ సమీపంలోని రైలుపట్టాల దగ్గరికి వెళ్లి వెనుదిరిగాయి.

పలు కోణాలలో దర్యాప్తు

బాబు కనిపించకుండా పోవడం వెనుక కిడ్నాప్ అయి ఉంటాడన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్ చేయాలంటే వీరికి ఎవరైనా పడరాని వాళ్లు ఉండాలి. ఊరిబయట ఇల్లు ఉందంటే కొత్త వాళ్లు కిడ్నాప్ చేసే అవకాశం తక్కువని, తెలిసిన వారే కిడ్నాప్ చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పోలీసు జాగిలాలు రైలు పట్టాల వరకు వెళ్లడంతో అక్కడ పనిచేసే సిబ్బందిని పోలీసులు సంప్రదించారు. అర్ధరాత్రి తరువాత ఇద్దరు వ్యక్తులు రైలు పట్టాల దగ్గర కనిపించారని చెప్పినట్లు సమాచారం. అయితే సరిగ్గా రెండు నెలల కిందట మన్యంకొండ దగ్గర గుర్తు తెలియని భార్యాభర్తలు పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చారన్న అనుమానంతో వారిపై దాడి చేశారు. వారిపై దాడి చేసిన వారిలో ప్రస్తుతం కిడ్నాప్ అయిన బాలుడి తండ్రితోపాటు తాత కూడా ఉండటంతో ఆ కోపంతో వారేమైనా కిడ్నాప్ చేసి ఉంటారా అన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేశారు.

భయపడ్డ కిడ్నాపర్లు

కాగా కిడ్నాపర్లు బాబును ఎత్తికెళ్లి చుట్టుపక్కలే ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు గాలింపు.. క్లూస్ టీమ్స్, జాగిలాల తనిఖీలతో నిందితులు భయపడినట్లు సమాచారం. దాంతో సోమవారం చీకటి పడిన తరువాత రాత్రి 7:30 గంటల సమయంలో గ్రామ ప్రధాన రహదారి పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలో బాలుడిని వదిలి వెళ్లారు. ఎనిమిది గంటల సమయంలో భవనంలోంచి బాలుడి ఏడుపు వినిపించడంతో స్థానికులు వెళ్లి చూడగా అక్కడ బాబు కనిపించాడు. ఉదయం నుంచి బాలుడు కిడ్నాప్ అయిన విషయం ప్రచారంలో ఉండటంతో ఈ బాబే అని భావించిన స్థానికులు తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని, బాబును తీసుకుని ముద్దాడి మురిసిపోయారు. రూరల్ ఎస్ఐ విజయ్ అక్కడికి చేరుకుని బాలుడిని వారికి అప్పగించారు. 19 గంటల్లోనే తల్లిదండ్రుల చెంతకు చేరడంతో కుటుంబ సభ్యులతోపాటు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నగదు పట్టివేత

నారాయణపేట రూరల్/నారాయణపేట, ఏప్రిల్ 29 : నారాయణపేట జిల్లా పరిధిలోని ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.85,500ల నగదు పట్టుబడినట్లు పేట ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. చేపల నర్సిములు అనే వ్యక్తి గుర్మిట్‌కల్ నుంచి చిన్నపొర్ల గ్రామానికి కారులో వెళ్తుండగా నగదును పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి పంపించామన్నారు. అదేవిధంగా, అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టిన వాహనాల తనిఖీలో ఆటోలో వస్తున్న రూ.37,800 విలువ చేసే మహిళల దుస్తులను సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

బాలానగర్ చెక్‌పోస్టు వద్ద..

బాలానగర్ : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.లక్షా 30 వేల నగదును పట్టుకున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కడుకుంట్ల మండలానికి చెందిన కూరగాయల శివన్న వద్ద రూ.80వేలు, అనంతపురం జిల్లా సిద్దాపురం గ్రామానికి చెందిన చింత హనుమంత్‌రెడ్డి వద్ద రూ.50వేల నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

ఆర్వోబీ నిర్మాణమయ్యేనా.?!

» మదనాపురం రైల్వేగేటు వద్ద ఆర్వోబీ లేక వాహనదారుల కష్టాలు
» నిర్మాణం తప్పనిసరైనా ఏర్పాటులో తాత్సారం



మదనాపురంలో రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

మదనాపురం, ఏప్రిల్ 29 : వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలోని రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) లేక వాహనదారులు, ప్రయాణికులు నిత్యం కష్టాలు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటు ఆత్మకూర్ - వనపర్తి ప్రధాన రహదారి మీదనే ఉండడంతో ప్రతీరోజు వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఆర్వోబీ లేకపోవడంతో రైలు వచ్చినప్పుడల్లా గేట్లు వేస్తున్నారు. గేటు తెరవడానికి 20 నిమిషాలు, ఒక్కోసారి రైలు క్రాసింగ్ అయితే అరగంట కూడా పడుతుంది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. రైల్వేగేటు తెరిచినప్పుడు త్వరగా పోవాలనే ఆతృతతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కోసారి ఈ ట్రాఫిక్‌లో అంబులెన్స్‌లు చిక్కుకుపోవడంతో రోగులను సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోతున్నాయి. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు డబుల్ లైన్ పనులు పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు పనులను మొదలు పెట్టారు. ఈ పనులు పూర్తయితే రైళ్ల సంఖ్య పెరిగి రహదారి ప్రయాణానికి మరిన్ని ఆటంకాలు ఏర్పడనున్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రతీసారి నాయకులు ఆర్వోబీ నిర్మిస్తామని చెప్పి గెలిచిన తరువాత మరవడం అలవాటుగా మారింది. మండలంలోని కొన్నూరు, నెల్విడి దగ్గర అండర్ పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. రామన్‌పాడు దగ్గర ఈ మధ్యనే పనులు ప్రారంభించారు. మదనాపురం దగ్గర ఉన్న రైల్వేలైన్ కిందికి ఉండడంతో కచ్చితంగా రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని రైల్వే అధికారులు అంచనా వేశారు. పనులు ఎప్పుడు మొదలు పెడుతారో.. మా కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని వాహనదారులు వేచి చూస్తున్నారు.

ప్రయాణాలు ఆలస్యమవుతున్నాయి..



ఇతర ప్రాంతాలకు రైల్వే గేటు మార్గంలో వెళ్లినప్పుడు గేటు వేయడంతో ప్రయాణాలు ఆలస్యమవుతున్నాయి. గేటు తెరవడానికి ఇరవై నిమిషాల సమయం పడుతోంది. వనపర్తి - ఆత్మకూర్ ప్రధాన రహదారి కావడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. అధికారులు వాహనదారులు, ప్రయాణికుల కష్టాలను తెలుసుకుని ఆర్వోబీని నిర్మించాలి.

- మహేష్‌కుమార్, మదనాపురం

ఉద్యోగులకు మరింత కష్టం



ఉద్యోగులు డ్యూటీలు వెళ్లినపుడు రైల్వేగేటు పడడంతో ఆఫీస్‌కు వెళ్లడానికి ఆలస్యమవుతోంది. దీని వలన అనుకున్న సమయానికి కంటే గంట ముందుగా బయలుదేరుతున్నాం. అలాగే స్కూలు బస్సులు కూడా ఆలస్యమై విద్యార్థులు పాఠశాలలకు లేటుగా వెళ్తున్నారు.

- చంద్రశేఖర్, ఉద్యోగి, మదనాపురం

సెక్యులర్ రైటర్స్ సభపై మతోన్మాదుల దాడిని ఖండిద్దాం

» పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, ఏప్రిల్ 29 : సమూహ సెక్యులర్ రైటర్స్ సభపై మతోన్మాదులు చేసిన దాడిని ఖండించాలని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఎం.రాఘవాచారిలు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సమాజంలో మత సామరస్యాన్ని, సమానత్వాన్ని సాధించుకుందామన్నారు. పోరుగల్లుగా సుప్రసిద్ధమైన వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్‌లో సమూహ సెక్యులర్ రైటర్స్ రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం నిర్వహించుకుంది. వేదికపై 15 మంది రచయితలు ఉండగా ఆసక్తిగా చర్చ జరుగుతున్న సమయంలో మతోన్మాదులు దాడికి పాల్పడటం దారుణమన్నారు. ముగ్గురు ఏబీవీపీ గుండాలు లోపలికి ప్రవేశించి సభ నిర్వాహకులను బూతులు తిడుతూ ఉద్రిక్త వాతావరణం కల్పించారన్నారు. బలవంతంగా వారిని బయటకి పంపితే వెళ్లినట్లే వెళ్లి మరో పదిమంది, ఒక పోలీసు, మూడోసారి ముగ్గురు పోలీసులు, ఒకరిద్దరు ఎన్నికల కార్యాలయ ఉద్యోగులతో కలిసి వచ్చారన్నారు. దాడిని నిలువరించటానికి చూసిన పసునూరి రవీందర్, జిలుకర శ్రీనివాస్, నరేష్‌కుమార్, సూఫీలపై దౌర్జన్యానికి దిగారన్నారు. ఏబీవీపీ వారు ఏమైనా చెప్పాలనుకుంటే సభల ద్వారా వారు చెప్పుకోవచ్చు, ఇతరుల సభలో ఏమి చెప్పకుండా అడ్డుకోవటం సరికాదన్నారు. భౌతిక దాడులతో తమ క్రూరత్వాన్ని మాత్రమే చాటుకోగలుగుతారన్నారు. దాడికి ఎవరు పాల్పడ్డారో పోలీసులకు తెలుసని వారిని అరెస్టు చేసి శిక్షించాలన్నారు.

గురుకులాల్లో విద్యార్థుల ఎంపికలకు ముగిసిన లక్కీడిప్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 29 : పాలమూరు ఉమ్మడి జిల్లాలోని 20 గురుకులాల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న నాన్ మైనార్టీ విద్యార్థులకు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలురు-1 గురుకులాల పాఠశాలలో లక్కీడిప్ నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీంద్రనాథ్ పర్యవేక్షించారు. ఎంపిక పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారి రవీంద్రనాథ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ ఖాజాబహాద్దీన్ జిల్లా కేంద్రంలోని ఆరు పాఠశాలలు(బాలికలు, బాలురు)కు సంబంధించి ఆన్‌లైన్ చేసుకున్న విద్యార్థులకు డిప్ నిర్వహించారు. 20 గురుకులాల్లో మైనార్టీ విద్యార్థులకు సంబంధించి 5,579 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. నాన్ మైనార్టీ విద్యార్థులు ఎస్సీ విభాగంలో 633, ఎస్టీ 320, ఓసీ 82, బీసీ 2,480 మందితో మొత్తం 3,515 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు జమీర్‌ఖాన్, అలీంఖాన్, ప్రిన్సిపాళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


లక్కీడిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీంద్రనాథ్

గుట్ట ముద్దు.. ఓటు వద్దు

» ఎన్నికలను బహిష్కరిస్తున్నాం
» మైలారం గ్రామస్థులు



ఎన్నికలను బహిష్కరిస్తున్నామంటూ నిరసన తెలుపుతున్న మైలారం గ్రామస్థులు

బల్మూరు, ఏప్రిల్ 29 : 'గుట్ట ముద్దు.. ఓటు వద్దు' అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని మైలారం గ్రామస్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మైలారం గ్రామ సమీపంలో ఉన్న గుట్టపై మైనింగ్ పనులు చేపడితే ఊరుకునేది లేదంటూ హెచ్చరికలు చేస్తూ సోమవారం గ్రామంలో ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు. ఆదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామస్థులపై అభిమానం లేకుండా గుట్టను తవ్వడానికి ప్రయత్నించే మైనింగ్ అధికారులకు సహకారాలందిస్తోందని ఆరోపించారు. రాజకీయ నాయకులను నమ్ముకొని ఈ గుట్టను పోగొట్టుకుంటే గుట్ట సమీపంలో ఉన్న మా ఇళ్లు అన్నీ కూలిపోతాయని వారు వాపోయారు. ఎన్నో ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామని, ఈ గుట్టను మైనింగ్ చేస్తే గ్రామంలో ఉన్న ప్రజలు అల్లకల్లోలంగా చీలిపోతారని, గ్రామాన్ని ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని వారు ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణను పదేపదే గుట్ట మైనింగ్ చేపట్టవద్దని ఇప్పటికే రాతపూర్వకంగా ఇచ్చామని, అదేవిధంగా తహసీల్దార్‌కు, ఉన్నతాధికారులకు కూడా కొరియర్ చేశామని అయినా గుట్టను మైనింగ్ పనులు చేపట్టాలని కుట్ర జరుగుతోందని వారు వాపోయారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికలకు ఈ గ్రామం నుంచి దూరమవుతున్నామని, ఎన్నికల్లో ఓటు వేసేందుకు తాము సిద్ధంగా లేమని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, నాయకులు, అధికారులు మైనింగ్ పనులను ఆపాలని, లేకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో తాము ఓటు వేయమని, ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాన్ని సందర్శించారు. సాధ్యమైనంత వరకు మైనింగ్ పనులు ఆపుతామని హామీ ఇచ్చినప్పటికీ గ్రామస్థులు మాత్రం జీవోను జారీ చేస్తేనే మేము ఎన్నికల్లో పాల్గొంటామని వాదించారు.

మత్స్య పరిశ్రమను ప్రోత్సహించాలి

» పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 29 : ప్రపంచ వ్యాప్తంగా 500 మిలియన్ల మంది ప్రజలు మత్స్య సంపదపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారతదేశంలో స్థిరమైన అభివృద్ధి కోసం మత్స్య సాగు ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో ఆవిష్కరణలు' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమానికి సంబంధించిన సావనీర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీరప్రాంత చేపల ఉత్పత్తి, ఆక్వాకల్చర్ ప్రధాన ఆర్థిక కార్యకలాపాల వల్ల ఎంతో మందికి జీవనోపాధి కల్పుతుందన్నారు. మత్స్యసంపద వల్ల చాలామందికి జీవనోపాధి కల్పుతుందన్నారు. జిల్లా మత్స్య పరిశ్రమ శాఖ డైరెక్టర్ డి.రాధారోహిణి మాట్లాడుతూ తెలంగాణలో వ్యవసాయ రంగం తర్వాత మత్స్య పరిశ్రమకు అధిక ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్, ఆర్‌పీలు డాక్టర్ ముత్తపకవి, డాక్టర్ భానుప్రకాష్, రాజశేఖర్, మోహన్‌రెడ్డిలు మత్స్యశాఖపై ప్రజెంటేషన్ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీపాధగంగాధర్, అమినా ముంతాజ్, కోఆర్డినేటర్ విజయలక్ష్మి, జంతుశాస్త్రం విభాగాధిపతి డా.సీహెచ్.శివప్రసాద్, వెంకటరమణమూర్తి, వర్ధిని, ప్రియ, ఆసియాబేగం, నాగలింగం, ఆనంద్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

ఎండలు బాబోయ్ ఎండలు

» వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత
» వడదెబ్బతో ఒకరి మృతి

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్/పెబ్బేరురూరల్, ఏప్రిల్ 29 : పాలమూరులో ఎండలు దంచి కొడుతున్నాయి. పదిహేను రోజులుగా విపరీతమైన ఎండ, ఉక్కపోతతో జనం చాలావరకు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళకుండా సర్దుబాటు చేసుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు, ఉపాధి కూలీలు, ఫుట్‌పాత్ వ్యాపారుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఎండలోనే పనులు చేయాల్సి ఉండటంతో తప్పక పనులు చేసుకుంటున్నారు.

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు బాలరాజు (30) సోమవారం వడదెబ్బతో మృతి చెందాడు. పని నిమిత్తం ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వనపర్తికి వస్తుండగా మార్గంమధ్యలో మర్రికుంట వద్ద తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ద్విచక్ర వాహనదారుడు అతన్ని అక్కడే దించి వెళ్లడంతో కాసేపటికే అతడు మృతి చెందాడు. అక్కడున్న స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తకోట మండల పరిధిలోని కానాయపల్లిలో 45.0, పెబ్బేరులో 44.5, ఆత్మకూర్‌లో 43.9, గోపాల్‌పేటలో 43.5, అమరచింత, పెద్దమందడిలలో 43.3, ఘనపూర్‌లో 42.5, మదనాపూర్‌లో 42.4, వీపనగండ్లలో 42.2, రేవల్లిలో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో ధరూర్‌లో 44.7, వడ్డేపల్లిలో 44.3, అలంపూర్‌లో 44.3, గద్వాలలో 43.9, ఇటిక్యాలలో 43.7, అయిజలో 43.7, కేటీదొడ్డిలో 43.4, ఉండవెల్లిలో 43, రాజోలిలో 42.6, మల్దకల్‌లో 42.6, గట్టులో 40.7 డిగ్రీలు నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో 44.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోడేరు మండలంలో 44.3, పెద్దకొత్తపల్లిలో 44.2, అచ్చంపేటలో 44.2, కల్వకుర్తిలో 44.1, వంగూరులో 43.7, బల్మూరులో 43.6, నాగర్‌కర్నూల్‌లో 43.4, వెల్దండలో 42.2, చారకొండలో 43.1, ఉప్పునుంతలలో 42.9, లింగాలలో 42.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులలో 43.8 డిగ్రీలు నమోదైంది. మూసాపేటలో 43, బాలానగర్, సీసీకుంటలో 42.7, కోయిలకొండలో 42.6, మిడ్జిల్‌లో 42.3, కౌకుంట్లలో 42.1, మహబూబ్‌నగర్‌లో 41.5, జడ్చర్లలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

నారాయణపేట జిల్లా మక్తల్, నర్వలలో 42 డిగ్రీలు, కోస్గి, కృష్ణలలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నది.

నేడు పదో తరగతి పరీక్షా ఫలితాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 29 : రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 18 నుంచి జరిగిన పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ఫలితాలు మంగళవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు విడుదల చేయనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 43 వేల మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.

పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడిగా రమేష్‌రెడ్డి


రమేష్‌రెడ్డి

రాజాపూర్, ఏప్రిల్ 29 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లతో పాటు, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం గుండ్లపొట్లపల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మార్పడ్గ రమేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్(టీపీకేసీ) సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

» మరొకరికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 29 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని బనగానపల్లెకు చెందిన సున్ని కాశిం(19), అమీర్ అనే ఇద్దరు యువకులు హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో స్నేహితుడి పెళ్లికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అలంపూర్ చౌరస్తా ఫ్లైఓవర్‌పై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నారు. దీంతో కాశిం అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న అమీర్‌ను స్థానికులు, పోలీసులు హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా, భార్యాభర్తలకు స్వల్ప గాయాలు

దామరగిద్ద, ఏప్రిల్ 29 : అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటనలో భార్యాభర్తలకు స్వల్ప గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామం వద్ద చోటు చేసుకుంది. దామరగిద్ద మండలం ఉడ్మల్‌గిద్ద గ్రామానికి చెందిన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ భార్యతో కలిసి సోమవారం ముస్తాపేట గ్రామంలో ఒకరి అంత్యక్రియలకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో కానుకుర్తి గ్రామ శివారులో సీటు బెల్టు పెట్టుకుంటుండగా కారు అదుపు తప్పి రాయిని ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టింది. గమనించిన బాటసారులు వారిని నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

భీమా కాల్వలో పడి మత్స్యకారుడి మృతి

మక్తల్, ఏప్రిల్ 29 : చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు భీమా కాల్వలో పడి మృతి చెందాడు. ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నారా యణపేట జిల్లా మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన మత్స్యకారుడు బండి శ్రీనివాసులు(44) చేపల వేటతో జీవనోపాధి సాగించేవాడు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఓ బాలుడు నర్సిములుతో కలిసి పంచదేవ్‌పహాడ్ గ్రామ సమీపంలోని భీమా కాల్వ వద్దకు చేపల వేట కోసం వెళ్లాడు. కాల్వలో వల వేసి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలుకు వల చుట్టుకొని భీమా కాల్వలోకి పడిపోయాడు. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో బాలుడు నర్సిములు గ్రామస్థులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్లు వచ్చి శ్రీనివాసులు మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి శవాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య జములమ్మతో పాటు, 13ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 29 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కూచూర్ నుంచి మహబూబ్‌నగర్ వైపు అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున కానిస్టేబుల్ సురేష్‌బాబు, శెట్టి నాయక్‌లు రుద్రారం సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సారా స్వాధీనం

వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 29 : వనపర్తి జిల్లా కేంద్రంలో సారా అమ్ముతున్న ఓ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్సై సంధ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యూబాలాజీనగర్‌లో ఓ మహిళ సారా విక్రయిస్తుందనే సమాచారంతో ఆమె ఇంట్లో తనిఖీలు నిర్వహించగా ఐదున్నర లీటర్ల సారా పట్టుబడిందన్నారు. సారాను స్వాధీనం చేసుకొని మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

రెండు వర్గాల ఘర్షణ, కేసు నమోదు

ఉప్పునుంతల, ఏప్రిల్ 29 : రెండు వర్గాలు పరస్పరం చేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో కట్టా అనంతారెడ్డి ఇంటి సమీపంలో సోమవారం తాడూరు గ్రామానికి చెందిన అక్కెకంటి సాయిరాం, ఒగ్గు మల్లేష్‌లకు చెందిన ఇరువర్గాలు 16 మంది సోమవారం ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ భానుప్రకాష్‌రెడ్డి ఇరువర్గాలను సముదాయించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నందుకు గాను ఇరువర్గాలపై భానుప్రకాష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

» పోటీల్లో పాల్గొంటున్న 25 జట్లు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

మానవపాడు, ఏప్రిల్ 29 : ఈదమ్మ దేవరను పురస్కరించుకొని మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సోమవారం ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో తలపడేందుకు తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి 25 జట్లు వచ్చాయి. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు లక్షల రూపాయల బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు, కానిస్టేబుల్ రవి తెలిపారు. రెండో బహుమతిగా రూ.60 వేలు, మూడు బహుమతిగా రూ. 40 వేలు, నాలుగో బహుమతిగా 25 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

రామన్‌పాడులో ప్రత్యేక వైద్య శిబిరం


రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

మదనాపురం, ఏప్రిల్ 29 : మండలంలోని రామన్‌పాడు గ్రామంలో వైద్యాధికారులు సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో రెండు రోజులుగా ప్రజలు కీళ్ల నొప్పులు, జ్వరాలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయచంద్ర రోగులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు తగ్గేంత వరకు వైద్య శిబిరం కొనసాగించాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు. సూపర్‌వైజర్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

- అదనపు కలెక్టర్ నగేష్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 29: అధికారులు సమన్వయంతో పని చేస్తు జిల్లాలో మాదకద్రవ్యాలను నియంత్రించాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న నియంత్రణ చర్యలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యాలయాల్లో మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ అధికారులు, ఆబ్కారీ, పోలీస్ శాఖ వారు నిఘా పెట్టాలని సూచించారు. మెడికల్ షాపులలో నిషేధిత మందుల అమ్మకం జరగకుండా వైద్య శాఖ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వనపర్తిని డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామదాస్ తేజావత్, ఆర్డీవో పద్మావతి, వైద్య అధికారి జయచంద్రమోహన్, విద్యాశాఖ తరపున విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


మార్నింగ్ వాక్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 29: ప్రజలను నమ్మించి మోసం చేయడంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలేనని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 18,19, 20వ వార్డుల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి మార్నింగ్ వాక్ చేస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని, మతోన్మాద బీజేపీ, అధికార దాహంతో తల్లడిల్లుతున్న బీఆర్ఎస్ రెండు పార్టీలకు కర్రుకాల్చి వాతపెట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పగిడాల శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు బాపనిపల్లి వెంకటేష్, సత్యంసాగర్, విభూది నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీలకు కనీస వసతులు కల్పించాలి

- కేంద్రం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి : జడ్పీ చైర్మన్ లోక్ నాథ్‌రెడ్డి


వెనికి తండాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లోక్ నాథ్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 29: వేసవిలో ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలని జడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కర్నె తండా, వెనికి తండా, ముందిరి తండా గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో సోమవారం ఉపాధి కూలీలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి కూలీలకు తాగు నీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ కోసం టెంట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయడంతో కోట్లాది మంది నిరుపేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. మహిళలకు బ్యాంకు రుణాలను అందించి ఆర్థిక అభివృద్ధి సాధించేలా బీజేపీ సర్కార్ కృషి చేస్తుందన్నారు. బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు అండగా నిలవాలని ఉపాధి కూలీలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రవినాయక్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

'రెండు ఎంపీ సీట్లు కాంగ్రెస్ ఖాతాలోకి రావాలి'

కొత్తకోట, ఏప్రిల్ 29 : ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ సీట్లు కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి రావాలనే లక్ష్యంతో కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను కలుసుకొని సొంత జిల్లా నాయకుడు రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడని, ఆయనకు మనం ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవిలను గెలిపించి బహుమతిగా ఇద్దామని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ ఆధ్వర్యంలో అమడబాకుల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, గొల్లబాబు, బోయెజ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'

ఆత్మకూరు, ఏప్రిల్ 29: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని బీజేపీ ఆత్మకూరు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అశ్వినికుమార్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణంలోని 210, 211 బూత్‌లలో బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే మరోసారి ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని కాంగ్రెస్ నాయకులను విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండాపురం రాము, బోరెల్లి రాము, బాలకృష్ణ, మల్లికార్జున్, సద్దల వెంకట రాములు, కురుమూర్తి, చందు, సూరితో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రంలో సామగ్రి చోరీ

పాన్‌గల్, ఏప్రిల్ 29: మండల కేంద్రంలోని విద్యుత్ కేంద్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ సామగ్రి చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉపకేంద్రం వెనుక భాగంలో ఉన్న వ్యవసాయానికి సంబంధించిన లక్ష రూపాయల విలువైన సామగ్రిని అపహరించినట్లు ఎస్ఐ తెలిపారు. సామగ్రి చోరీకి గురైన ప్రాంతంలో క్లూస్ టీంతో నమూనాలను సేకరించామని ఆయన తెలిపారు. విద్యుత్ ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చలి వేంద్రంలో మజ్జిగ పంపిణీ

కొత్తకోట, ఏప్రిల్ 29 : పట్టణ చౌరస్తాలో జీఎంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ చలివేంద్రంలో రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన చెరకు అభివృద్ధి మండలి మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆ గ్రామ మాజీ సర్పంచ్ శివరాములు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తకోట మాజీ సర్పంచ్ అరుణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, రజక సంఘం నాయకులు వెంకటేష్, రాచాల లక్ష్మయ్య కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కక్షలు లేకుండా జీవించండి : డీఎస్పీ

కొత్తకోట, ఏప్రిల్ 29 : గ్రామాల్లో ప్రజలు కక్షలు, కార్పాణ్యాలు లేకుండా జీవించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం రాత్రి కొత్తకోటలోని దండుగడ్డ కాలనీలో సీఐ రాంబాబు, ఎస్సై మంజునాథ్‌రెడ్డిలతో కలిసి కమ్యూనిటీ కంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇళ్ల ముందున్న వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీ కాలనీలకు కొత్త వ్యక్తులు ఇళ్లు అద్దెకు తీసుకోవడానికి వస్తే ఆధార్ కార్డు పరిశీలించి జిరాక్స్ కాపీ తీసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున వేర్వేరు పార్టీలో ప్రచారం చేసిన ఓటు వేసే ప్రజలను వత్తిడి చేయద్దన్నారు. మీరున్న కాలనీల్లో ఎలాంటి సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని తొమ్మిది ఎస్సైలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మెగా ర్యాలీ విజయవంతం

- ప్రతీ ఓటరు కచ్చితంగా ఓటు వేయాలి - ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


పాలిటెక్నిక్ కళాశాల ముందు మాట్లాడుతున్న కలెక్టర్, భారీగా హాజరైన జనం


పాలిటెక్నిక్ కళాశాల ముందు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 29: అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చేపడుతున్న స్వీప్ యాక్టివిటీలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సబ్బండ వర్గాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, కవులు, కళాకారులతో వనపర్తి జిల్లాలో సాయంత్రం ఏర్పాటు చేసిన మెగా ర్యాలీ విజయవంతమైంది. ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం, ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం, ఇందిరా పార్కు ఇలా మూడు దిక్కుల నుంచి వేలాదిగా తరలివచ్చిన సబ్బండ వర్గాల ప్రజలు, ప్లకార్డులు, మేము ఖచ్చితంగా ఓటు వేస్తాం అనే నినాదాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందు గుమిగూడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ... మే 13వ తేదీన ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని అన్నారు. ప్రతీ ఒక్కరికీ ఓటరు స్లిప్ ఇంటింటికి వచ్చి ఇస్తారని తెలిపారు. తన ఓటు ఎక్కడ ఉంది. ఏ ఏరియాలో ఉంది అనే వివరాలు స్లిప్‌లో ఉంటాయని నవ ఓటర్లు, మహిళలు, దివ్యాంగులు, వయసు పైబడిన వారితో సహ ప్రతీ ఒక్కరు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే సీ విజిల్ యాప్ లేదా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన ఎస్పీ రక్షిత కె.మూర్తి మాట్లా డుతూ... మే 13న జిల్లాలోని ప్రతీ ఓటరు తన ఓటు ను నిర్భయంగా తనకు నచ్చిన అభ్యర్థికి వేయాలని కోరారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరించినా, భయభ్రాంతులకు గురిచేసిన పోలీస్ యంత్రాంగం లో ఎవరికైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ర్యాలీకి వచ్చిన వారితో కలెక్టర్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, స్వీప్ నోడల్ అధికారి రామ మహేశ్వరరెడ్డి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగుపడాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన పనుల పరిశీలన
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి


కర్నెతండాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పరిసరాలను పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 29: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని కర్నెతండాలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య భవనాన్ని సోమవారం చిన్నారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం పూర్తి కావస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను విస్తరిస్తుందని తెలిపారు. కర్నె తండా, ముందరి తండాలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం పర్వతాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దామోదర్ రెడ్డి దశదినకర్మలో చిన్నారెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేష్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు మున్నూరు జయకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

- ఎన్నికల పరిశీలకులు డీఐజీ అమోఘ్ జీవన్ గాంకర్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐజీ అమోఘ్ జీవన్ గాంకర్

వనపర్తి క్రైం, ఏప్రిల్ 29: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల పరిశీలకుడు డీఐజీ అమోఘ్ జీవన్ గాంకర్ అన్నారు. సోమవారం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లతో పాటు చెక్ పోస్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఓటరు నిర్భయంగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ప్రతీ పోలింగ్ బూత్ దగ్గర సిబ్బంది పకడ్బందీగా భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ బూత్ కు 100 మీటర్ల దూరంలో పార్కింగ్ సౌకర్యంతో పాటు ఓటు వేసిన వారిని దూరంగా ఉంచాలన్నారు. మే 11వ తేదీన ఐదు గంటల తరువాత ప్రచారం బంద్ చేయడంతో పాటు పకడ్బందీగా తనిఖీలు చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల నియంత్రణలో పోలీస్ యంత్రాంగం క్రమశిక్షణతో విధులు నిర్వహించి శాంతియుత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయాలన్నారు. ఎస్పీ రక్షిత కె.మూర్తి మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నాగభూషణం, ఎస్ఐ జయన్న పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ రక్షిత కె.మూర్తి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత మండలాల ఎస్ఐలను ఆదేశించారు. మొత్తం నాలుగు ఫిర్యాదులు రాగా భార్యభర్తల తగాదాలకు సంబంధించినవి రెండు, మరో రెండు పరస్ప గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి.

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేదే టీజేఎస్

- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాష


టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న నాయకులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 29: తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి(టీజేఎస్)అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాష అన్నారు. సోమవారం టీజేఎస్ ఆరవ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ కార్యాలయం దగ్గర ఘనంగా జరుపుకున్నారు. అంబేడ్కర్, జయశంకర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బులే కేంద్రంగా జరుగుతున్న నేటి రాజకీయాల్లో తెలంగాణ జన సమితి మాత్రం ప్రజలతో మమేకమై, ప్రజల సమస్యలను నిరంతరం రాజకీయ ఎజెండా మీద నిలపగలిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై అవిశ్రాంత పోరాటం సాగించి, భూ నిర్వాసితుల పక్షాన 317 జీవోపై పోరాడి వారికి ధైర్యం చెప్పిన పార్టీ టీజేఎస్ అని అన్నారు. రాబోయే రోజుల్లో పైసల రాజకీయాలను అధిగమించాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు బాలకృష్ణ, రాజేష్ కుమార్‌శెట్టి, పికిలి బాలయ్య, వినోద్‌కుమార్, రాము, షేక్ సోఫీ అలీ పాల్గొన్నారు.


బీజేపీతోనే దేశాభివృద్ధి : రావుల

కొత్తకోట, ఏప్రిల్ 29: కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశం ప్రపంచంలో నంబర్ వన్‌గా అభివృద్ధి చెందుతుందని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాటవెల్లి, నాటవెల్లి తండా, పామాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. నాటవెల్లిలో ఉపాధి కూలీలను కలుసుకోని ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావాలంటే పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కొత్తకోట మునిసిపల్ కౌన్సిలర్ భరత్ భూషణ్ పాల్గొన్నారు.

కొత్త సూగూరులో..

పెబ్బేరు రూరల్ : మండలంలోని కొత్త సూగూరు గ్రామంలో బీజేపీ మండల నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్ ప్రధాని మోదీ అమలు చేస్తున్న పతకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మహేందర్, వంశీ, ఈశ్వర్, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీల్లో బండను లాగుతున్న ఎద్దులు

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 29: మండలంలోని సోలీపూర్ లక్ష్మీనరసింహ యోగానంద స్వామి ఆరాధన ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఐదు జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న పశుసంపదను గుర్తు చేయడానికి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ఈ పోటీల్లో ప్రతిభ చాటిన తాడూరు ఎద్దుల యజమానులకు నగదు అందజేశారు. ప్రథమ స్థానంలో యాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ అఖిలేష్ రెడ్డి ఎద్దులు నిలవగా.. ద్వితీయ స్థానంలో గద్వాలకు చెందిన గోసాయి వినీల్ ఎద్దులు, తృతీయ స్థానంలో చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దులు నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.40వేలు, తృతీయ బహుమతిగా రూ.30వేల నగదును ఆలయ కమిటీ నిర్వాహకుడు తినేటి రవీందర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వెంకటేశ్వర రావు, బాలకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి సతీష్, ప్రకాష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేత మహబూబ్‌నగర్

అమరచింత, ఏప్రిల్ 29: చింతల మునిరంగ స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల్లో భాగం గా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. సెమీ ఫైనల్‌లో ఆత్మకూరు మండలం మూలమల్ల జట్టు, కర్నూల్ జిల్లా ప్యాపిలి జట్టు తలపడ్డాయి. ప్యాపిలి జట్టుపై మూలమల్ల జట్టు విజయం సాధించి ఫైనల్‌కి వెళ్లింది. అప్పటికే ఫైనల్‌కు చేరుకున్న మహబూబ్‌నగర్ జిల్లా జట్టు, మూల మల్ల జట్లు ఆదివారం తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్ ఆదివారం మధ్య రాత్రి వరకు కొనసాగిన ఉత్కంఠ కబడ్డీ పోరులో చివరకు మహబూబ్ నగర్ జట్టు విజేతగా నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన మహబూబ్‌నగర్ జట్టుకు రూ.40వేలు, షీల్డ్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన మూలమల్ల జట్టుకు రూ.30వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కర్నూల్ జిల్లా ప్యాపిలి జట్టుకు రూ.20వేలు, నాలుగో స్థానంలో నిలిచిన రైల్వే టీం హైదరాబాద్ జట్టుకు రూ.10వేల నగదు అందజే శారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజావర్ధన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నాగరాజు, ముని రవిచంద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ అంజనేయులు, బోయ శేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి, వైసీపీ బాల్ రెడ్డి, కుమ్మరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సుజాత

కొత్తకోట, ఏప్రిల్ 29 : రాష్ట్రంలోని అన్ని వర్గాల పేద ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య కాలం నుంచి ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా.. ఏ ప్రభుత్వం కూడా పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి ఆలోచించ లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే కార్పొరేషన్ ఏర్పటు చేశారని అన్నారు. మన గురించి ఆలోచించే ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో అండగా ఉండాలని కోరారు. అనంతరం ఆర్యవైశ్యులు ఆమెను శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సతీమణి ఆశ్లేష, ఎమ్మెల్యే భార్య కవిత, పట్టణ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాగబంది యాదగిరి తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

- గద్వాల మాజీ ఎమ్మెల్యే భరత సింహారెడ్డి


ప్రచారంలో భాగంగా కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే భరత సింహారెడ్డి

అమరచింత, ఏప్రిల్ 29: బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపుతోనే ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధి సాధ్యమని గద్వాల మాజీ ఎమ్మెల్యే భరత సింహారెడ్డి అన్నారు. సోమవారం అమరచింత మండలంలోని చింతరెడ్డిపల్లి, మిట్టనందిమల్ల గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మి కాంత్‌రెడ్డితో కలిసి ఆయన డీకే అరుణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాలపై పూర్తి స్థాయిలో పట్టున్న డీకే అరుణను ప్రజలు ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. డీకే అరుణ గెలుపుతోనే ఈ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నరేంద్ర మోదీ ఉచిత రేషన్ బియ్యం, సురక్ష బీమా, ఫసల్ బీమా, కిసాన్ సమ్మాన్ యోజన వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి దేశ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాల్లో భారత దేశ కీర్తిని పెంపొందించిన వ్యక్తి నరేంద్ర మోదీ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేర్వ రాజు, వెంకటేశ్వర్లు, నరాల నారాయణ, క్యామ భాస్కర్, మరాఠీ అశోక్, రాజేందర్‌రెడ్డి, హరీష్ ,మల్లారెడ్డి, బురుజు భీమ్‌రెడ్డి, రాకేష్ శెట్టి, వాటర్‌శీను, రామలింగం, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది : బీఆర్ఎస్

వీపనగండ్ల, ఏప్రిల్ 29: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ తెలిపారు. సంగినేనిపల్లి గ్రామానికి చెందిన మైలారం బాలయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఇచ్చిన రూ.10 వేలను సోమవారం సత్యనారాయణగౌడ్ బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మౌలాలి, కురుమయ్య, రాజవర్ధన్‌రెడ్డి, దామోదర్ తదితరులు ఉన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

వీపనగండ్ల, ఏప్రిల్ 29: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అప్తాలమిక్ అసిస్టెంట్ మురళీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దృష్టిలోపం ఉన్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి మహబూబ్‌నగర్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు.

టీబీని నిర్లక్ష్యం చేయొద్దు

వీపనగండ్ల, ఏప్రిల్ 29: టీబీ వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. సోమవారం టీబీ వాధిపై ఆశ వర్కర్లు ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ మందులు సక్రమంగా వాడి వ్యాధిని నివారించుకొవచ్చని మందులు వాడకంలో నిర్లక్ష్యం చేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున బయటకు వెళ్లకూడదని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ పై దాడి, కేసు నమోదు

అమరచింత, ఏప్రిల్ 29: తన ద్విచక్రవాహనానికి ఆర్టీసీ బస్సుడ్రైవర్ సైడ్ ఇవ్వడం లేదని ఆగ్రహంతో ఓ వ్యక్తి డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన మండలంలోని నాగల్‌కడుమూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి అమరచింత మీదుగా పెద్దకడుమూరు గ్రామానికి వెళ్తుంది, నాగల్‌కడుమూర్ గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వస్తున్నా అదే గ్రామానికి చెందిన రవికుమార్ బస్సు సైడ్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో వేగంగా వచ్చి బస్సు ఆపి డ్రైవర్‌తో గొడవకు దిగాడు, డ్రైవర్ లక్ష్మన్న, కండక్టర్ రాజ్ మహమ్మద్‌లు ఎంత చెప్పినా రవికుమార్ వినకపోగా తిరిగి వాళ్లపై దాడికి దిగాడు, దీంతో దాడిలో గాయపడ్డ డ్రైవర్‌ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. వెంటనే డ్రైవర్ కండక్టర్లు ఆస్పత్రి రిపోర్టులను తీసుకొని డిపో మేనేజర్‌కు సమాచారం అందించి ఆర్టీసీ బస్సును అమరచింత పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తమపై దాడి చేసిన రవికుమారన్ పై ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.